క్లుప్తంగా

రేషన్ బియ్యం ఇవ్వాలని వినతి



తహసీల్దార్‌కు అర్జీ ఇస్తున్న నాయకులు

అగళి: ప్రభుత్వం 1వ తేదీ సరఫరా చేయాల్సిన రేషన్ బియ్యం నేటికీ సరఫరా చేయకపోవడంలో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్ తెలిపారు. రేషన్ సరుకుల కోసం రోజూ లబ్ధిదారులను తిప్పుకోవడం సరికాదని విమర్శించారు. ఇందులో భాగంగానే బుధవారం తహసీల్దార్ సుబ్బరావుకు వినతిపత్రం అందజేశారు. మండలంలోని ప్రజలకు రేషన్ బియ్యం సరిగా పంపిణీ చేయడం లేదని, లబ్ధిదారులకు బియ్యం ఇవ్వకుండా వేలిముద్రలు తీసుకొని స్టాక్ లేదని వచ్చే నెలలో ఇస్తామని చెబుతున్నారన్నారు. అగళి పంచాయతీలో దాదాపు 120 మంది వరకూ రేషన్ బియ్యం అందలేదన్నారు. సీఎస్‌డీటీతో మాట్లాడి రేషన్‌కార్డుదారులకు బియ్యం అందేలా చూస్తామని తహసీల్దార్ సుబ్బరావు హామీ ఇచ్చారు.

మండల మీట్ మళ్లీ వాయిదా

గోరంట్ల: మండల సర్వసభ్య సమావేశం మరోసారి వాయిదా పడింది. బుధవారం స్థానిక ఎంపీడీఓ సమావేశ మందిరంలో మండల మీట్ జరగాల్సి ఉంది. అయితే మండలంలో 22 మంది ఎంటీసీలు ఉండగా కేవలం బూదిలి ఎంపీటీసీ మినహా ఏ ఒక్కరు హాజరు కాలేదు. నిధుల పంపకంతో పాటు ప్రోటోకల్ పాటించే విషయంలో అధికారులు ఎంపీటీసీలను చిన్న చూపు చూస్తున్నారంటూ ఎంపీటీసీ సభ్యులు గైర్హాజరైనట్లు తెలిసింది. ఎంపీపీ ప్రమీల ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చినప్పటికీ సర్వసభ్య సమావేశ భవనంలోకి మాత్రం వెళ్లకపోవడం విశేషం. కోరం లేకపోవడంతో రెండోసారి కూడా సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ నరేంద్ర పేర్కొన్నారు. మండలంలోని ఎంపీటీసీలతో చర్చించి 10 రోజుల తరువాత సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు.

చిలమత్తూరులో గాలీవాన బీభత్సం



సంజీవరాయునిపల్లికి వెళ్లే రహదారిపై కూలిన చెట్టు

చిలమత్తూరు: మండలంలో గాలీవాన బీభత్సం సృష్టించింది. బుధవారం సాయంత్రం ఒక్కసారిగా వర్షం మొదలవగా కాసేపటికే భారీ ఈదురుగాలులు వీచాయి. దీంతో పలు గ్రామాలకు వెళ్లే రహదారుల్లో వృక్షాలు కూలిపోవడంతో రాకపోకలు స్తంభించాయి. మండల కేంద్రం నుంచి సంజీవరాయునిపల్లికి వెళ్లే ప్రధాన రహదారిపై భారీ వృక్షం కూలడంతో రాకపోకలు స్తంభించాయి. చిలమత్తూరులో దుకాణాల వద్ద ఏర్పాటు చేసుకున్న నేమ్ బోర్డులు కొట్టుకుపోయాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈదురుగాలులు వీయడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. అరగంట పాటు వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


మౌలిక వసతులు కల్పించాలి



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ఈరేష్

గుడిబండ: గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ఈరేష్ పేర్కొన్నారు. బుధవారం గుడిబండ పట్టణంలో ఉన్న ఎంజేపీ కళాశాలను సందర్శించారు. ఇటీవల విడుదలైన జూనియర్ ఇంటర్ ఫలితాల్లో వందశాతం ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సరైన మౌలిక సదుపాయాలు కల్పించి విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఆంజి, వినోద్, తిప్పేష్ పాల్గొన్నారు.

శ్రీహరికోటకు బయలుదేరిన విద్యార్థులు



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న ఎంఈఓలు గంగప్ప, ప్రసన్న లక్ష్మీ

హిందూపురం టౌన్: ఇన్‌స్పైర్ మనాక్ అవార్డుల్లో భాగంగా మొత్తం 50 మంది విద్యార్థులు శ్రీహరికోట అంతరిక్ష కేంద్ర విజ్ఞాన యాత్రకు ఎంపికయ్యారని ఎంఈఓ గంగప్ప చెప్పారు. ఇందులో భాగంగానే వారంతా బుధవారం సాయంత్రం శ్రీహరికోటకు బయలుదేరి వెళ్లారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బీవీ ప్రసాద్, జగదీష్, విజయ భార్గవి, శైలజ, అనిత తదితరులు పాల్గొన్నారు.

అధిక దిగుబడికి వేసవి దుక్కులు



ట్రాక్టర్‌తో భూమిని దున్నుతున్న రైతు

- వేసవి దుక్కులతో చీడ పీడలకు చెక్
- మరింత సారవంతంగా భూమి
- అధిక దిగుబడి పొందవచ్చంటున్న వ్యవసాయాధికారులు

మడకశిరరూరల్: తొలకరి వర్షాలు అక్కడక్కడా కురుస్తుండడంతో రైతులు పొలాల్లో వేసవి దుక్కులు దున్నుకోవడానికి సిద్ధమవుతున్నారు. పొలాలకు సేంద్రియ ఎరువులను తోలుకుంటు వచ్చే ఖరీఫ్ వ్యవసాయానికి సమాయత్తం అవుతున్నారు. వేసవి దుక్కులు దున్నుకోవడం వల్ల ఎంతో ప్రయోజనమని వ్యవసాయాధికారులు చెపుతున్నారు. వేసవిలో పొలాలను దున్నుకోవడంతో కలుపు, చీడపురుగులు నశిస్తాయని, పొలం కూడా మొత్తబడి అధిక దిగుబడి పొందవచ్చని అంటున్నారు.

తక్కువ ఖర్చుతో...

ముందస్తు వ్యవసాయంలో రైతులు సస్యరక్షణ పద్ధతులు పాటించినప్పుడే తక్కువ ఖర్చుతో పంట సాగులో అధిక దిగుబడులు సాధించవచ్చు. అధికంగా పురుగు మందులు వాడితే ఖర్చులు పెరగడంతో పాటు పంటలో దిగుబడులు తగ్గడానికి అవకాశం ఉంటుంది. వేసవి దుక్కులతో రైతులకు ప్రయోజనాలు ఎక్కువగా ఉంటాయి.

ఖరీఫ్ సీజన్‌కు ముందే...

ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే భూమిని లోతుగా దున్నుకోవాలి. ఇలా దున్నుకుంటే తొలకరి వర్షాలకు నేల మొత్తబడి భూమిలోకి వర్షపు నీరు ఇంకుతాయి. భూమిలో తేమ శాతం నిల్వ చేసే సామర్థ్యం పెరుగుతుంది. భూమిని దుక్కి దున్ని వదిలితే కలుపు మొక్కలను తగ్గించవచ్చు. భూమిని దున్నే ముందు పశువుల ఎరువు, చెరువు, కుంటల మట్టిని వేయాలి. వేసవిలో దుక్కి దున్నితే భూమి వదులుగా ఉంటుంది. నీటి నిల్వ సామర్థ్యం పెరిగి జీవించే సూక్ష్మజీవులు, వానపాముల సంతతి వృద్ధి చెందుతుంది. దీని వల్ల పంట సాగుకు ఎంతో అనుకూలంగా మారి మంచి దిగుబడి సాధించవచ్చు.

ఖర్చు తగ్గించుకోవాలి

పంట సాగుకు అధికంగా ఖర్చు పెట్టడం కన్నా యాజమాన్య పద్ధతి పాటిస్తే సాగు అయ్యే ఖర్చు తగ్గించుకోవచ్చు. సాగుకు ముందే భూ సార పరీక్షలు చేయించుకుంటే వాటికి అనుగుణంగా సూక్ష్మ పోషకాలను వినియోగించుకోవచ్చు. పంట కాలం ముగిశాక భూములను ఖాళీగా ఉంచితే పంటలను ఆశించే చీడపీడలు, తెగుళ్లను కలగచేసే శిలీంద్రాలు భూమి పొరల్లో ఆశ్రయం పొందుతాయి. దుక్కులు చేస్తే చీడపురుగుల గుడ్లు, అవశేషాలు వెలుపలికి వచ్చి బయట ఉష్ణోగ్రతలకు చచ్చిపోతాయి.

దిగుబడి పెరుగుతుంది



పంట సాగుకు రసాయ ఎరువుల వాడకాన్ని తగ్గించి పశువులు, గొర్రెలు, మేకల ఎరువులు పంట సాగుకు ఉపయోగిస్తున్నాను. దీని వల్ల పంట దిగుబడితో పాటు చీడపీడలు వ్యాప్తి తక్కువగా ఉంటాయి. వేసవి దుక్కులు దున్నడం ద్వారా భూమి కూడా సారవంతంగా ఉంటుంది. సేంద్రియ ఎరువులను ఉపయోగించి పంటలో మంచి దిగుబడులు పొందుతున్నాను. ప్రభుత్వం వ్యవసాయానికి ప్రాధాన్యత కల్పించాలి. – నరసింహమూర్తి, రైతు, కదిరేపల్లి

భూమి సారవంతమవుతుంది



వేసవిలో భూమిని దున్ని పంటసాగుకు పశువులు, గొర్రెలు,మేకల ఎరువును ఉపయోగించడంతో పంట దిగుబడి పెరగడంతో పాటు భూమి సారవంతంగా ఉంటుంది. పశువుల ఎరువును కొనుగోలు చేసి పంట సాగుకు వేస్తున్నాను. రసాయన ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువును వేస్తుండడంతో పంటకు తెగుళ్ల వ్యాప్తి తగ్గుతుంది. – హనుమంతరాయప్ప, రైతు, గౌడనహళ్లి

నియోజకవర్గంలో భూమి ఇలా..	
మండలం	భూమి (ఎకరాల్లో)
మడకశిర	29,200
రొళ్ల	16,100
అగళి	10,000
గుడిబండ	26,000
అమరాపురం	23,100

రంగనాథస్వామికి మాజీ మంత్రి పూజలు



పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

సోమందేపల్లి: మండల పరిధిలోని గుడిపల్లిలో వెలసిన సజ్జగంట రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం జరిగిన పూజా కార్యక్రమంలో మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్చకులు, ఆలయ ధర్మకర్త రమాకాంత్‌రెడ్డి ఆమెకు ఘన స్వాగతం పలికారు. స్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు కళ్యాణ్ నివాసంలో కార్యకర్తతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ప్రభాకర్ రావు స్వామి, కేశవ, రంగప్ప తదితరులు పాల్గొన్నారు.

పరిగి మండలంలో పర్యటన

పరిగి: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ బుధవారం మండలంలో పర్యటించారు. తొలుత శీగిపల్లి పంచాయతీ పరిధిలోని గణపతి పల్లిలో కురుబ యల్లప్ప కుమార్తె యామినీ వివాహం ఈశ్వర్‌తో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం పరిగి మండల కేంద్రంలో గత రాత్రి గుండెపోటుతో మృతి చెందిన టీడీపీ నాయకుడు, మాజీ వైస్ ఎంపీపీ వడ్డే చౌడప్ప భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. అనంతరం మోదా పంచాయతీ పరిధిలోని బైలాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో అంజినప్ప కుమారుడు గంగాధర్ వివాహం కృష్ణవేణితో జరిగింది. వేడుకలో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. ఆయా కార్యక్రమాల్లో మండల కన్వీనర్ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమావేశాన్ని బహిష్కరించిన ఎంపీటీసీలు

- 18 నెలల గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఎంపీటీసీలు, సర్పంచులు

రొద్దం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశ భవనంలో బుధవారం ఎంపీపీ నాగమ్మ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీటీసీలు బహిష్కరించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామ్‌కుమార్ సమావేశాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించగానే రిజిస్టర్‌లో సంతకాలు చేయకుండా సభ్యులంతా సమవేశం నుంచి లేచి సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు ప్రకటించి బయటకు వెళ్లిపోయారు. తమకు రావాల్సిన గౌరవ వేతనం ప్రభుత్వం మంజూరు చేయడం లేదని, అలాంటప్పుడు సర్వసభ్య సమావేశం ఎందుకని ప్రశ్నించారు. కార్యాలయం ఎదుట ఎంపీటీసీలు నిరసన తెలిపారు. ఎంపీటీసీలు మాట్లాడుతూ దాదాపు 18 నెలలకు సంబంధించిన గౌరవ వేతనం ఇవ్వలేదని వాపోయారు. అలాగే మండల గ్రాంట్‌కు సంబంధించిన పనులు చేయడం లేదన్నారు. ఒక్కో ఎంపీటీసీకి రూ. 3 లక్షలకు సంబంధించిన పనులు చేయనివ్వడం లేదన్నారు. అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో ప్రభుత్వ అధికారులు నడుచుకుంటున్నారని విమర్శించారు. గౌరవ వేతన మంజూరు చేస్తేనే సమావేశానికి హాజరవుతామన్నారు. కోరం లేక పోవడంతో ఎంపీడీఓ సమావేశాన్ని వాయిదా వేయాల్సి వచ్చింది. కార్యక్రమంలో ఎంపీటీసీలు, కో-ఆప్షన్ మెంబర్, సర్పంచులు పాల్గొన్నారు.

రేపు మడకశిరలో మంత్రుల పర్యటన

మడకశిర: నియోజకవర్గంలో శుక్రవారం రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర రెవెన్యూశాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యప్రసాద్, రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితమ్మ పర్యటిస్తారని విద్యుత్‌శాఖ డీఈఈ రఘు ఒక ప్రకటనలో తెలిపారు. వైబీహళ్లి, కదిరేపల్లి, ఇనగలూరు, శివరం విద్యుత్ సబ్ స్టేషన్లను ప్రారంభిస్తారన్నారు. అలాగే గుండుమల, కేకేపాళ్యం, రంగసపల్లిలో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారన్నారు.

బాధ్యతతో చదివితేనే ఉజ్వల భవిష్యత్తు

పెనుకొండ: విద్యార్థులు బాధ్యత, క్రమశిక్షణతో చదివితేనే ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ జయప్ప పేర్కొన్నారు. పట్టణంలోని డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రథమ సంవత్సరం విద్యార్థులు తృతీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి కళాశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కాస్మోటిక్ చార్జీలను పెంచాలి

హిందూపురం టౌన్: పట్టణంలోని ముక్కడిపేటలో ఉన్న ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలో పీడీఎస్‌యూ నూతన కమిటీను బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి బాబావలి మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులకు నిత్యావసరాలకు అనుగుణంగా మెస్ కాస్మోటిక్ చార్జీలను పెంచాలని, అదే విధంగా హాస్టల్‌లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ జిల్లా కమిటీ సభ్యులు సాయిరాం, నాయకులు దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్ రాజీనామా

సంక్షిప్త సమాచారం

పావగడ: స్థానిక మున్సిపల్ చైర్మన్ పీహెచ్ రాజేశ్ తన పదవికి రాజీనామా చేశాడు. స్థానిక మున్సిపల్ నూతన భవనంలో బుధవారం నిర్వహించిన చివరి సభలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే వెంకటేశ్, మాజీ మంత్రి వెంకటరమణప్ప సమక్షంలో కుదిరిన కాల పరిమితి ఒప్పందం మేరకు మాట తప్పకుండా తన రాజీనామా పత్రాన్ని కలెక్టర్‌కు అందజేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా తన హయాంలో జరిగిన అభివృద్ధి పనులను వివరించారు. తనకు సహకరించిన మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో నేడు సమావేశం

హిందూపురం: అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల సమోదు అధికారి, సంయుక్త కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం మధ్యాహ్నం 2:30 గంటలకు గుర్తింపు పొందిన పొలిటికల్ పార్టీ ప్రతినిధులతో తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ వెంకటేష్ తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తప్పని సరిగా హాజరుకావాలని కోరారు.

తపాలా బీమాపై అవగాహన

అమరాపురం: గ్రామీణ ప్రాంతంలోని ప్రజలు గ్రామీణ తపాలశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీమాను చేయించి ధీమగా ఉండాలని అమరాపురం బ్రాంచ్ పోస్టుమాస్టర్ రాజశేఖర్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని తమ్మడేపల్లి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో తపలా బీమా చేయించడం వలన కలిగే ప్రయోజనాలను ఆయన వివరించారు.

నీటి వనరులపై సర్వే చేయండి

అమరాపురం: జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని గ్రామాల్లో నీటి వనరులపై సర్వే చేయాలని వీఆర్వోలకు మండల ఏఎస్‌ఓ రమణ నాయక్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం వీఆర్వోలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఓ మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో నీటి లభ్యత గల వాటిని గుర్తించాలన్నారు.

టీబీ వ్యాధిపై అవగాహన

రొద్దం: టీబీ వ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహనతో ఉండాలని డాక్టర్ సోమశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని టీబీ వ్యాధిపై అవగాహన కల్పించారు. పెనుకొండ యూనిట్ ల్యాబ్ టీబీ సూపర్ వైజర్ శశిధర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహా గణపతికి పూజలు

హిందూపురం: పట్టణంలోని గణపతి ఆలయాల్లో బుధవారం సంకష్టహర చతుర్థిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీనివాసనగర్, బెంగళూరురోడ్‌లోని గణపతి ఆలయంలో స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు తీర్థ ప్రసాదాలను స్వీకరించి తమ ఉపవాసదీక్షలను విరమించారు.

సీనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు

లేపాక్షి: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సీనియర్ అసిస్టెంట్‌గా సుబ్రహ్మణ్యం బాధ్యతలను చేపట్టినట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి తెలిపారు. బుక్కపట్నం మండలం సిద్దారాంపురం ప్రభుత్వ పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై ఇక్కడ బాధ్యతలు చేపట్టారన్నారు.

చళ్లకెరె క్రాస్‌కు పునీత్ కుమార్ పేరు

పావగడ: పట్టణ పరిధిలోని చళ్లకెరె క్రాస్‌కు ప్రముఖ హీరో, దివంగత పునీత్ కుమార్ పేరును పెడుతూ మున్సిపల్ కౌన్సిలర్లు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఇదిలా ఉండగా వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన రాజ వీర మదకరి నాయక పేరును పెట్టేలా స్థానిక వాల్మీకి సంఘం నాయకులు తీవ్ర ప్రయత్నాలు చేశారు. అయితే చివరకు పునీత్ కుమార్ పేరును ఖరారు చేయడంపై వాల్మీకి సంఘం నాయకులు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది.

అంబేడ్కర్ స్మృతి వనాన్ని ప్రైవేట్‌పరం చేస్తే ఊరుకోం

మడకశిర: విజయవాడలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ స్మృతి వనాన్ని కూటమి ప్రభుత్వం ప్రైవేట్‌పరం చేస్తే చూస్తూ ఊరుకోమని వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి ఒక ప్రకటనలో హెచ్చరించారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు దళితుల సంక్షేమానికి పాటుపడకుండా అన్యాయం చేయడానికి పూనుకోవడం దుర్మార్గమన్నారు. చంద్రబాబుకు నిజంగా దళితులపై ప్రేమ ఉంటే ఆ ఆలోచనను విరమించుకోవాలన్నారు. అండేడ్కర్ స్మృతి వనాన్ని ప్రైవేట్ పరం చేస్తే దళిత ద్రోహిగా మిగిలిపోతారన్నారు. చంద్రబాబు తన ఆలోచనను మార్చుకోకపోతే దళితవాడల్లోకి రాకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు.

నిందితులకు శిక్షపడేలా చూడండి

పెనుకొండ: ఎస్సీ, ఎస్టీ కేసుల్లో తగిన చర్యలు చేపట్టి నిందితులకు శిక్షపడేలా చూడాలని దళిత సంఘాల నాయకులు డీఎస్పీ నరసింగప్పను కోరారు. పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో బుధవారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీఎస్పీని పలువురు దళిత సంఘాల నాయకులు కలిశారు. ఈ సందర్భంగా డీఎస్పీకి వినతిపత్రంతో పాటు పుష్పగుచ్ఛం అందజేశారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి రామాంజినేయులు, రాయలసీమ జిల్లాల కోకన్వీనర్ పెద్దన్న, గౌతమ్ ప్రసాద్, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు ఎంఎస్. మూర్తి, కురుగుంట గోవింద్, గడ్డం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉష్ణోగ్రత సమాచారం

హిందూపురం	36.0
పెనుకొండ	38.0
మడకశిర	36.0

రేషన్ పంపిణీలో కోతలెందుకు?



మాట్లాడుతున్న ఎంపీపీ పురుషోత్తమరెడ్డి

చిలమత్తూరు: రేషన్ పంపిణీలో డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ లబ్ధిదారులకు కోత పెడుతున్నారని ఎంపీపీ పురుషోత్తమరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో అన్ని రేషన్ షాపుల్లోనూ లబ్ధిదారులకు బియ్యం ఇవ్వకుండా కోత విధిస్తున్నారన్నారు. భూమయ్యగారిపల్లిలో సుమారు 40 మందికి బియ్యం ఇవ్వలేదన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలన్నారు. అలాగే గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓకు సూచించారు. ప్రజలు మైక్రో ఫైనాన్స్ వలలో చిక్కుకోవద్దని ఎంపీపీ పురుషోత్తమరెడ్డి ప్రజలకు సూచించారు. పొజిషన్ పత్రం ఉంటేచాలు మైక్రో ఫైనాన్స్ రుణాలు మంజూరు చేస్తున్నారని, అయితే అధిక వడ్డీలు భారం మోపి రుణ గ్రహీతలను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమణమూర్తి, డిప్యూటీ తహసీల్దార్ జగన్నాథం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై దృష్టి సారించండి

సోమందేపల్లి: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నరేంద్ర కుమార్ అధికారులకు ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గంగమ్మ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతనం అందలేదని సభ్యులు తెలిపారు. మెజార్టీ సభ్యులు లేకపోవడంతో సమావేశం చప్పగా సాగింది. సమావేశంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ మారుతీ ప్రసాద్, వాల్మీకి కార్పోరేషన్ డైరెక్టర్ ఆంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



హిందూపురం: మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్ ప్రభాకర్

పెనుకొండ: గ్యాస్ వినియోగం జరిగే అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను అగ్నిమాపక సిబ్బంది ప్రజలకు వివరించారు. బుధవారం వజ్రాలపేట, మంగాపురంలో అవగాహన కల్పించారు. డెమో ద్వారా ప్రజలకు అర్థమయ్యేలా వివరించారు.

హిందూపురం అర్బన్: వంట గదిలో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు, ఎల్‌పీజీ వాడకం పై ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న దానిపై మహిళలకు అగ్నిమాపక అధికారి ప్రభాకర్, సిబ్బంది అవగాహన కల్పించారు. పట్టణంలోని పాండురంగ నగర్, అంబికా అపార్ట్ మెంట్, చుట్టు పక్కల నివసించే మహిళలకు డెమో ద్వారా అవగాహన కల్పించారు.

ఉద్యోగాలను పర్మినెంట్ చేయండి



ఆర్డీఓ ఆనంద్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్: ఆప్కాస్ విధానాన్ని రద్దు చేసి నగర పంచాయతీ కాంట్రాక్ట్ ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌కు కార్మికులు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో చిన్న వెంకటేష్, నరసింహ, చలపతి, చంద్ర, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జ్యోతుల ఉత్సవం



అలంకరణలో రత్నగిరి కొల్హాపురి మహాలక్ష్మీదేవి



జ్యోతులను ఊరేగింపుగా తీసుకొస్తున్న మహిళలు

రొళ్ల: రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం వైభవంగా అమ్మవారికి జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు. రత్నగిరితో పాటు గుడ్డగుర్కి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి అమ్మవారికి కూడా గ్రామస్తులు జ్యోతుల ఉత్సవాన్ని జరిపారు. వేకువజామున నుంచే సుప్రభాత సేవ, అంకురార్పణ, అభిషేకం, కుంకుమార్చన పూజలు చేశారు. అమ్మవారి మూల విగ్రహంతో పాటు ఉత్సవ విగ్రహాన్ని పట్టువస్త్రాలు, వెండి, బంగారు ఆభరణాలు, పూలతో అలంకరణ చేసి మహా మంగళారతి ఇచ్చారు. అనంతరం మహిళలు జ్యోతులను గ్రామ పుర వీధుల గుండా మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారికి పొట్టేళ్లు, మేకలు, కోళ్లలను బలిఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు జ్యోతుల ఉత్సవాలు..

రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం హెచ్ఎం పల్లి, వన్నారనపల్లి, హులీకుంట, బాజయ్యపాళ్యం, కొత్తపాళ్యం, కొడగార్లగుట్ట, హొట్టేబెట్ట, దాసప్ప పాళ్యం, జీఎస్ పాళ్యం, వన్నప్పపాళ్యం, అలుపనపల్లి, ఏ.గొల్లహట్టి తదితర గ్రామాల్లో అమ్మవారికి జ్యోతుల ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ప్రజలు తెలిపారు. జ్యోతుల ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని గ్రామ పెద్దలు కోరారు.